
## సింగిల్ పేజీ కథ

# 'తాహాతు'

**-ఆకెళ్ళ గిరిజ**

రాంబాబు మాకు ఫ్యామిలీ ఫ్రెండు. తరచుగా మా ఇంటికి వస్తూ, పోతూ ఉంటాడు.

సహజంగా హుషారు, చలాకీ అయిన వాడు కావడంతో, త్వరలోనే మా ఇంట్లో ఒక మనిషిగా కలిసి పోయాడు. 'అన్నయ్యా' అంటూ నన్నూ, 'వదినా' అంటూ మా ఆవిణ్ణీ పిలుస్తూ ఎంతో చేరువైపోయాడు.



మేం కూడా అతణ్ణి దూరంగా పెట్టకుండా, ఎన్నో సొంత విషయాల సైతం రాంబాబుతో చర్చిస్తూ ఉంటాం.

ఇలా రోజులు గడుస్తూండగా, ఈ మధ్యనే రాంబాబుకి పెళ్ళయింది. అతని భార్య రమణి కాపురానికొచ్చింది.

ఆ అమ్మాయి కూడా ఎంతో కలుపుగోలు మనిషి కావడంతో త్వరగా మాలో కలిసిపోయింది.

ఎప్పుడైనా సాయంత్రం పూట ఇద్దరూ స్కూటర్ మీద మా ఇంటికి వచ్చి కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పుకుని కాఫీ, టిఫిన్లు చేసి, మా ఆవిడ బలవంతంచేసే ఒకోసారి. రాత్రిభోజనం కూడా మా ఇంట్లోనే ముగించి వెళ్ళే వాళ్ళు.

అప్పుడప్పుడు సరదాగా వచ్చే ఆ జంట ఓ రోజు ఇంట్లో ఏం దెబ్బలాడుకున్నారో గాని... మా ఇంటికొచ్చాక కూడా ఆ పోట్లాట కంటిన్యూ చేశారు.

మామూలుగా నడుస్తున్న సంభాషణలో ఒక్కసారిగా వాళ్ళిద్దరి వాద, ప్రతివాదాలు దెబ్బలాట రూపం దాల్చే సరికి నేనూ, మా ఆవిడా ఆశ్చర్యపోయాం.

"పెళ్ళిలో డిన్నర్ మీ వాళ్ళేం బాగా చేశారు? ఆనపకాయ పప్పు, పులుసునీళ్ళు, మజ్జిగ నీళ్ళు...ఒకళ్ళ విస్తరిలో పోస్తుంటే రెండో విస్తర్లోకి పరిగెడుతూ... ఛీ...ఛీ...తలుచుకుంటే ఇప్పటికీ రోత..." అన్నాడు రాంబాబు.

"ఏం చేస్తాం? మా వాళ్ళా పేదవాళ్ళు...వాళ్ళ తాహతుకి సరిపడ్డట్టు చేశారు. మీవాళ్ళు డబ్బుగల వాళ్ళు... మాకు పెట్టారుగా చీటీ గుడ్డలు..." దెప్పి పొడిచింది రమణి.

"మీ, వాళ్ళూ పెట్టారుగా కొత్తల్లుడికి ఆవకాయ చొక్కా, అర్థ గజం తువ్వాలు, మోకాలుపైకిపోయిన పంచాను. మా ఇంట్లో పాలేరుకి పడేశాను..."

"నేనూ ఇచ్చేశాను మీ వాళ్ళు పెట్టిన జాకెట్టు గుడ్డ మా ఇంట్లో పని మనిషికి..."

"నోర్మూయ్.."

"ఆ మాటే నేనంటే ?"

అలా అలా పెరిగిపోతోంది యుద్ధం...నేనూ, మా ఆవిడా మొహా మొహాలు చూసుకున్నాం.

"రాంబాబూ! ఊరుకోవయ్యా!"

"రమణీ నువ్వూరుకోమ్మా!"

అందులో ఆ భార్యా భర్తల పాత్ర ఎంత అ ప్రశ్నించుకున్న మాకు సమాధానం తేలిగ్గానే దొరికింది పెళ్ళిళ్ళలో సాధ్యమైనంత వరకూ అన్ని విషయాలూ పెట్టుబడులతో సహా అన్నీ అటూ ఇటూ పెద్దవాళ్ళే నిర్ణయించి సరుకులు కొనడం, పురమాయించడం చేస్తారు

దాంట్లో సహజంగా వాళ్ళు 'కక్కుర్తి' గానే చేస్తారు. ఆ 'కక్కుర్తి'నే అవతల వాళ్ళు బయటపెట్టినపుడు వాళ్ళ బాధకలుగుతుంది.

అలా మేనేజ్ చేసిన వాళ్ళందరూ పెళ్ళయిపోగానే సీన్‌లోంచి తప్పుకుంటారు (అత్త మామలతో సహా) పర్యవసానంగా ఈ భార్యా భర్తలు అడపా దడపా, లేద జీవితాంతం ఈ స్వల్ప విషయాల గురించి పోట్లాడుకుని తమ మంచి సమయాన్ని కాస్తా పాడుచేసుకుంటారు.

అదే కాస్త విడమరచి చెప్పాను ఇద్దరికీ!

"అది కాదన్నయ్యా! అల్లుడంటే మా ఇంట్లో మా బావకి ఎంత రెస్పెక్ట్ ఇచ్చేవాళ్ళం... అదేం లేదు వాళ్ళింటికెళ్తే నేనేదో భోజనానికి విస్తరి చాపుక్కూర్చున్న వెధవలా ట్రీట్ చేస్తారు...కంట్రీఫెలోస్...నా తాహతేమిటి? వాళ్ళతాహతేమిటి? నేను వాళ్ళింటికి ఎందుకు భోజనాని కెళతాను? వెధవ సొరకాయ పప్పు, చారునీళ్ళూను..." "తాహతు' అనే మాటని మర్చిపో... పెళ్ళంటూ అయిపోయాక... నీ తాహతు...ఏది ఉందో...అదే నీ భార్యకీ వర్తిస్తుంది. ఎందుకంటే ఆమె నీ భార్య కాబట్టి. నువ్వు ఆమె భర్తవి కాబట్టి...అపుడు మీ ఇద్దరి తాహతులూ విడివిడిగా ఉండవు... కలిసే ఉంటాయి... అదే మీ కుటుంబం తాహతు...లేదా స్టేటస్...దాన్ని నిలుపుకోవటం కోసం మీరిద్దరూ కృషిచేయాలి..." అని ఆపాను.

ఇద్దరూ సాలోచనగా నావంక చూశారు. మా ఆవిడ కూడా? "ఆ కృషి ఇలా మాత్రం కాదు..." అనే సరికి అందరూ నవ్వేశారు.

-ఆకెళ్ళ గిరిజ
ఇ.నం.21-138/3, ప్లాట్ నం.41,
ఉత్తమ్‌నగర్, సఫిల్‌గూడ,
హైదరాబాద్-47.